నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 8 డిసెంబర్ 2024 | HYDERABAD

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

టీడీఆర్... బాధితుల పరార్..!

పాత నగరంలో సవాల్‌గా మారిన ఆస్తుల సేకరణ

- ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ వద్దంటున్న బాధితులు
- నష్ట పరిహారానికి మొగ్గు
- జీహెచ్ఎంసీ వద్ద నిధులు లేకపోవడంతో ప్రభుత్వమే చెల్లింపులు జరుపుతున్న వైనం

సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : ఫ్లై ఓవర్లు..ఆర్వోబీ..ఆర్‌యూబీలు, రహదారులు, నాలాల విస్తరణ..లింకు రోడ్లు... అభివృద్ధి ఏదైనా సకాలంలో ప్రాజెక్టు పూర్తి కావాలంటే భూసేకరణే అత్యంత కీలకం. ఆయా ప్రాజెక్టు వ్యయం ఎంత ఖర్చు అవుతుందో..భూసేకరణకు అంతే స్థాయిలో వ్యయమవుతుంది. అయితే ఆస్తుల సేకరణలో గణనీయమైన మార్పును గత ప్రభుత్వం తీసుకొచ్చింది. 2017లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 'టీడీఆర్' పాలసీని తీసుకొచ్చారు. గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి పథకాల కోసం చేపట్టే భూసేకరణ, ఆస్తుల సేకరణ సందర్భంగా ఇచ్చే నగదు నష్టపరిహారానికి బదులుగా ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) అమలు చేశారు. దేశంలో మరే ఏ నగరంలో జరుగని విధంగా రికార్డు స్థాయిలో ఈ టీడీఆర్‌లను జీహెచ్ఎంసీ అందజేసింది. అభివృద్ధి కార్యక్రమాలకు చేసే భూ సేకరణలకు నగదు మొత్తం ఇవ్వడానికి బదులుగా టీడీఆర్‌లు ఇచ్చే విధానాన్ని, టీడీఆర్ బ్యాంకును ప్రవేశపెట్టిన జీహెచ్ఎంసీని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నీతి అయోగ్ కూడా ప్రశంసించడం గమనార్హం. ఈ టీడీఆర్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అవలంభించాలని నీతి అయోగ్ సూచించింది. ఇంత విజయవంతమైన టీడీఆర్ పాలసీని నీరుగార్చింది ప్రస్తుత ప్రభుత్వం. పాతనగరంలో టీడీఆర్‌లకు కనీస ఆదరణకు నోచుకోవడం లేదు. టీడీఆర్ వద్దంటూ పరిహార బాధితులంతా పరార్ అవుతున్నారు. టీడీఆర్ వద్దు నష్టపరిహారమే కావాలంటున్నారు. దీంతో సకాలంలో ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందకపోవడంతో పాత నగరంలో అధికారులకు ఆస్తుల సేకరణ సవాల్‌గా మారింది.

వివిధ అభివృద్ధి పథకాల కోసం..

గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి పథకాల కోసం చేపట్టే భూసేకరణ, ఆస్తుల సేకరణ సందర్భంగా జీహెచ్ఎంసీ టీడీపీఆర్ పత్రాలను అందజేస్తున్నారు. అభివృద్ధి పనులకు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమిని సేకరించి, నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా ఈ టీడీఆర్‌ను ఇస్తున్నారు. ఏదైన ఒక నిర్వాసితుడు నాలా విస్తరణ వల్ల ఏ మేరకు స్థలాన్ని కోల్పోయాడో, అంతకు నాలుగు రెట్లకు టీడీఆర్ పత్రాలను పరిహారంగా పొందుతాడు. ఉదాహరణకు అమీర్‌పేటలో 20 గజాల స్థలాన్ని కోల్పోయిన నిర్వాసితుడు జీహెచ్ఎంసీ ఇచ్చే 80 గజాల టీడీఆర్ పత్రాన్ని తీసుకుని ఇతరులకు విక్రయించుకునే హక్కు పొందుతాడు. టీడీఆర్ పత్రం కలిగిన వారు, జీహెచ్ఎంసీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి ఇచ్చే అనుమతికి అదనంగా చేపట్టే నిర్మాణ వైశాల్యాన్ని నిబంధనలను అనుసరించి క్రమబద్ధీకరించుకోవచ్చు. ఫలితంగా లక్ష రూపాయలు ఇవ్వాల్సిన పరిస్థితుల్లో..టీడీఆర్ ద్వారా అంతకు రెట్టింపు లేదా, తనకు నచ్చిన మొత్తానికి విక్రయించుకుని లాభపడుతున్నారు. అయితే పాతనగరం మినహా ఇతర ప్రాంతాల్లో ఈ టీడీఆర్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంది. మార్కెట్లో టీడీఆర్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. కానీ పాతనగరంలో మాత్రం టీడీఆర్‌లను వద్దంటున్నారు. ఈ విషయంలో అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యమేనని చెప్పవచ్చు.

ఎస్ఆర్‌డీపీలో భాగంగా..

మొత్తంగా పాత నగరంలో వివిధ అభివృద్ధి పనులకు ఆస్తుల సేకరణ నత్తనడకగా సాగుతున్నది. ఎస్ఆర్‌డీపీలో భాగంగా జూ పార్కు-ఆరాంఘర్ ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల విస్తరణ, సైదాబాద్‌లో స్టీల్ బ్రిడ్జి పనుల్లో భాగంగా ఆస్తుల సేకరణే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నది. వీటితో పాటు నాలాల అభివృద్ధి, రహదారుల విస్తరణలో భూసేకరణ జాప్యమవుతున్నది. జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం టీడీఆర్ వద్దంటున్నారంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతుండడంతో స్పెషల్ ఫండ్ కింద పాత నగరంలో భూ పరిహార బాధితులకు ప్రభుత్వం నుంచే నష్ట పరిహారం అందజేస్తూ వస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఆలస్యంగా వస్తుండడంతో ఆస్తుల సేకరణ సందిగ్ధంలో పడింది.

రహదారి ఆక్రమణల కూల్చివేత

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డును ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న సముదాయాలను శనివారం హెచ్ఎండీఏ అడిషనల్ కలెక్టర్ షర్మిల ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ షర్మిల మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేసిన సమయంలోనే హెచ్ఎండీఏ బ్రిడ్జి చుట్టూ ఉన్న భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కానీ కొందరు రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలాలను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో నిత్యం గచ్చిబౌలి నుంచి ఓఆర్ఆర్‌పై వచ్చిన వాహనాలతో పాటు, బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనదారులు ఎయిర్‌పోర్టుకు వెళ్లడం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం అయితే చాలు.. గంటల తరబడి ట్రాఫిక్‌జాం కావడంతో ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఎయిర్‌పోర్టు ఫ్లైఓవర్ బ్రిడ్జి చుట్టూ ఉన్న భూములు పూర్తిగా హెచ్ఎండీఏకు చెందినవేనని అడిషనల్ కలెక్టర్ షర్మిల స్పష్టం చేశారు. అక్కడి చేరుకొని కూల్చివేతలు నిలిపివేయాలని అడ్డుతగిలే ప్రయత్నం చేసిన్నట్లు తెలిపారు. రెండు రోజులు సమయం ఇవ్వాలని కోరడంతో కూల్చివేతలు నిలిపివేసినట్లు చెప్పారు. రెండ్రోజుల్లో వంతెన చుట్టూ ఉన్న భూమిలో ఉన్న నిర్మాణాలు పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, గతంలో భూమిని సేకరించిన సమయంలో మాకు ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వలేదని స్థానికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. 'రెండు రోజులు సమయం ఇస్తున్నం. ఏదైనా ఉంటే అన్ని తొలగించాలని, లేదంటే.. పూర్తిగా హెచ్ఎండీఏ తొలగించడం ఖాయమని అధికారులు స్పష్టం చేశారు.

విలీనం వద్దే వద్దు

మా ఊరు మాకు ముద్దు..

- మున్సిపాలిటీల్లో 51 గ్రామాల విలీనం
- హడావిడిగా ఆర్డినెన్స్ జారీతో వివాదాలు
- పట్టణీకరణ పేరుతో భారీగా ఆర్థికభారం
- విలీనాన్ని వ్యతిరేకిస్తున్న పల్లె ప్రజలు

విలీన పంచాయతీల్లో విప్లవం

నిర్ణయం మారకుంటే మరో ఉద్యమం తప్పదని సర్కారుకు హెచ్చరిక

గ్రామాల విలీనానికి లైన్ క్లియర్

ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడం అనివార్యంగా మారింది. విలీనంపై కాంగ్రెస్ సర్కార్ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గతంలో విలీన ప్రక్రియను చేపడుతూ విడుదల చేసిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ పలు గ్రామాల ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు. అయితే సర్కారు తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రకారమే విలీన ప్రక్రియ సాగుతుందన్న ప్రభుత్వ వాదనలకు హైకోర్టు ఆమోదం తెలిపింది. దీంతో విలీనంపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేయడంతో... విలీన ప్రక్రియ అనివార్యంగా మారింది. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోని 51 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ పలువురు కోర్టును ఆశ్రయించినా... పిటిషన్లను సీజే ధర్మాసనం కొట్టి వేయడంతో విలీన ప్రక్రియపై ప్రభుత్వం మరింత దూకుడు పెంచనున్నది.

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఒక చారిత్రక తప్పిదం.. ఒక విలీనం.. 60 ఏండ్ల గోసకు కారణమైంది. కొట్లాడి తెచ్చుకుంటే స్వేచ్ఛావాయువులు లభించాయి. ఇప్పుడు గ్రేటర్‌లో మరో విలీనం కలకలం రేపుతున్నది. మరో విప్లవానికి శ్రీకారం చుడుతున్నది. కత్తి పక్కోడిది అయినా పొడిచేది మనోడే అన్నట్టు.. కాంగ్రెస్ సర్కారు పల్లెవాసులపై కత్తికట్టింది. భారీ కుట్రలకు తెరలేపింది. సాధారణ పల్లెవాసులు ఈ విలీనం వద్దే వద్దు.. మా గ్రామమే మాకు ముద్దు అని మొత్తుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో హడావిడిగా ఆర్డినెన్స్ జారీ చేసింది. హైదరాబాద్ చుట్టుపక్కల విస్తరించి ఉన్న ఔటర్ రింగు రోడ్డు పరిధిలో 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అక్కడితో ఆగకుండా పక్కావ్యూహంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి తీసుకువచ్చే ప్రణాళికలను గుట్టుచప్పుడు కాకుండా అమలు చేస్తున్నది. ప్రభుత్వ మొండివైఖరిపై పల్లెల్లో మరో ఉద్యమం ఊపందుకుంటున్నది. సర్కారు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో మరో విప్లవాన్ని సృష్టిస్తామని విలీన గ్రామల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

రచ్చబండల వద్ద చర్చ

రేవంత్ ప్రభుత్వం తీసుకున్న 51 గ్రామాల విలీన ప్రక్రియ పెద్దఎత్తున విమర్శలకు తావిస్తున్నది. రంగారెడ్డి జిల్లాలో 12, మేడ్చల్ జిల్లాలో 28, సంగారెడ్డి జిల్లాలో 11గ్రామాలను 13 మున్సిపాలిటీల్లో విలీనం అయ్యాయి. గ్రామాలను విలీనం చేసే విషయంలో గ్రామస్తుల అభిప్రాయం తీసుకోకుండా 2నెలల వ్యవధిలోనే ఒక సంస్థ అభిప్రాయం, అధికారులతో కమిటీ వేసి, ఆ తర్వాత క్యాబినెట్ సబ్ కమిటీ వేసి వారి అభిప్రాయం ద్వారానే విలీన ప్రక్రియ హడావిడిగా చేశారనే విమర్శలు ఉన్నాయి.విలీనమైతే భూముల ధర పెరగడం మాటేమోకానీ, విలీన గ్రామాలను హైడ్రా పరిధిలోకి తీసుకురావడంతో రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందోనన్న భయం గ్రామస్తులను వెంటాడుతున్నది. పన్నుల భారం, కోల్పోనున్న పచ్చదనం, అధికారులను కలిసే అవకాశమేలేని పాలనా అసౌకర్యం, రాజకీయ నిరుద్యోగం, పర్మిషన్లు కావాలన్నా.. ఏ సర్టిఫికెట్ తీసుకోవాలన్నా తప్పని ఆర్థికభారం.. ఇవన్నీ ప్రస్తుతం రచ్చబండల వద్ద చర్చకు వస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పల్లెకోసం కదం తొక్కుతున్నారు. గ్రామ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచారణను సిద్ధం చేసుకుంటున్నారు.

అంతా హడావిడే

గ్రేటర్ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరించే ప్రణాళికతో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలను విలీనం చేయాలని సర్కారు సంకల్పించింది. అస్కీకి విలీన ప్రక్రియపై అధ్యయనం చేసే బాధ్యత అప్పగించింది. మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, మల్కాజ్‌గిరి కలెక్టర్లతో మరో కమిటీ వేసింది. ఈ రెండు కమిటీలు ఓఆర్ఆర్ చుట్టుపక్కల ఉన్న 45 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయొచ్చని సూచించింది. ఆగస్టు 1న క్యాబినెట్ సబ్‌కమిటీ వేయగా ఆగస్ట్ 22న వారు నివేదిక ఇస్తూ 45 గ్రామాలకు మరో 6 గ్రామాలు కలుపాలని సూచించింది. మున్సిపల్ చట్టం 2019కి సవరణలు చేస్తూ, సెప్టెంబర్ 3న 51గ్రామాల విలీనానికి ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. గవర్నర్‌తో ఆమోదముద్ర వేయించారు. తమతో ఎలాంటి సంప్రదింపులు లేకుండానే హడావిడిగా ఈ ప్రక్రియ చేపట్టడంపై మెజార్టీ గ్రామాల్లో వ్యతిరేకత పెల్లుబికుతున్నది. ఈ విలీన ప్రక్రియ వెనుక పూర్తిగా కుట్రకోణం దాగి ఉందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఈ విషయంపై శంషాబాద్, శంకర్‌పల్లి మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ధర్నాలు చేశారు. తమకు తెలియకుండానే గ్రామపంచాయతీ కార్యదర్శి విలీనంపై దొంగ సంతకాలు చేశారని ఆరోపిస్తున్నారు. ఇక కొన్ని గ్రామాలు విలీనమే వద్దని ఏకగ్రీవంగా తీర్మానాలూ చేస్తున్నాయి.

మున్సిపాలిటీల్లో విలీనమైన మొత్తం గ్రామాలు : 51

రంగారెడ్డి జిల్లా - 12 : మేడ్చల్ జిల్లా - 28 : సంగారెడ్డి జిల్లా - 11

విలీన గ్రామాలు ఇవే

జిల్లా	మున్సిపాలిటీ	విలీనగ్రామాలు
రంగారెడ్డి	పెద్ద అంబర్‌పేట	బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట
	శంషాబాద్	బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ, ఘాన్సీమియగూడ
	నార్సింగి	మీర్జాగూడ
మేడ్చల్	తుక్కుగూడ	హర్షగూడ
	మేడ్చల్	పూడూర్, రాయిలాపూర్
	దమ్మాయిగూడ	కీసర, యాదగిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి
	నాగారం	భోగారం, గోధుమకుంట, కరీంగూడ, రాంపల్లిదాయర
	పోచారం	వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ
	ఘట్‌కేసర్	అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్వల్లిగూడ
	గుండ్లపోచంపల్లి	మునీరాబాద్, గౌడవెల్లి
	తూంకుంట	బొంరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ
సంగారెడ్డి	అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్‌తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్
	తెల్లాపూర్	పోచారం, ముత్తంగి, కర్దనూర్, పాటి, ఘనాపూర్

మా గ్రామాల కోసం కొట్లాడుతాం

గ్రామ పంచాయతీ ఉంటే ప్రజలకు పాలన చేరువగా ఉంటుంది. మున్సిపాటీలు, జీహెచ్ఎంసీలో గ్రామాలను కలిపితే సామాన్య ప్రజలకు పాలన దూరం అవుతుంది. పన్నులు పెరిగి పేదలపై భారం పడుతుంది. ఉపాధి హామీ పనులు బంద్ అవుతయి. పేద, మధ్య తరగతికి ఎలాంటి ఉపయోగం ఉండదు. అందుకే మా గ్రామాల కోసం కొట్లాడుతాం. ఐక్య కార్యచరణను సిద్ధం చేసుకుంటాం.

-చారి, కిష్టారెడ్డిపేట, సంగారెడ్డి జిల్లా

ప్రజాభిప్రాయం లేదు

తెల్లాపూర్ మున్సిపాలిటీలో అధికారులు ముత్తంగి గ్రామాన్ని బలవంతంగా కలిపారు. ఎక్కడా ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదు. ప్రజలందరూ ఒప్పుకున్నారని అధికారులే రాసుకుని విలీనం చేశారు. రేపు తెల్లాపూర్ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో కలుపుతారంట. అప్పుడు ప్రజలకు ట్యాక్స్‌ల భారం పెరుగుతుంది. పేదలు, మధ్య తరగతివారు జీవించడం కష్టతరంగా మారుతుంది.

- అనిల్‌కుమార్, ముత్తంగి, సంగారెడ్డి జిల్లా

సామాన్యులకు పన్నుల మోత

మా గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీనివల్ల సామాన్యులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. మా గ్రామం ఇంకా పల్లె వాతావరణంలోనే ఉంది. గ్రామాన్ని అభివృద్ధి చేసిన తరువాత మున్సిపాలిటీలో కలిపుతే బాగుండేది. పన్నుల మోత సామాన్యులకు భారంగా మారనున్నది. ప్రజల ఇష్టం లేకుండా ప్రభుత్వం బలవంతంగా విలీనం చేయడం తగదు.

- పెంటోశీగౌడ్, దాయర గ్రామం, సంగారెడ్డి జిల్లా

పట్టాలు లేవంటూ.. డబుల్ ఇండ్లకు విద్యుత్ నిలిపివేత

కీసర: కీసరలోని డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ఇంటి పట్టాలు లేవంటూ.. విద్యుత్‌ను నిలిపివేశారు అధికారులు. దీంతో లబ్ధిదారులు నేరుగా మండల తహసీల్దార్ అశోక్‌కుమార్‌ను కలిసి..ఇంటి పట్టాలు ఇవ్వాలంటూ.. వినతిపత్రాన్ని అందజేశారు. లబ్ధిదారులకు ఇంటి పట్టాలు లేనందున విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు హెచ్చరిస్తున్నారని, ఇండ్లు కేటాయించిన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు.

జనవరి 6 నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

సిటీబ్యూరో: జనవరి 6 నుంచి మార్చి 9 వరకు సికింద్రాబాద్‌లోని జోగిందర్ సింగ్ స్టేడియంలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనున్నది. 17 నుంచి 21 ఏండ్ల వయస్సు అర్హతగా నిర్ణయించారు. మరింత సమాచారం కోసం దరఖాస్తుదారులు ఈస్ట్ మారేడ్‌పల్లిలోని ఏవోసీ సెంటర్‌ను సంప్రదించొచ్చని అధికారులు పేర్కొన్నారు. tuskercrc-2021<\@>gov.in లేదా visit www.joinindianarmy<\@>nic.in ద్వారా కూడా సమాచారం పొందొచ్చని సూచించారు.

రేపు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

- హాజరుకానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మేడ్చల్, డిసెంబర్7(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపునిచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ సమీపంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 9న ప్రారంభించనున్న నేపథ్యంలో శంభీపూర్ రాజు శనివారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరు కానున్నట్లు చెప్పారు. కేటీఆర్‌తో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, రాజ్యసభసభ్యులు, పార్టీ రాష్ట్ర నాయకులు హాజరువుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారని శంభీపూర్ రాజు విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అణిచివేతలు, అరాచకాలు, కూల్చివేతలు, జైళ్లు, కేసులు తప్ప..ఏమీ లేవని చెప్పారు. ప్రజాపాలన కాదని.. తెలంగాణలో రాక్షస పాలన కొనసాగుతున్నదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉన్న రోజులను తెలంగాణ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఏ పథకాన్ని అమలు చేయకుండానే ఏడాది పాలనపై వారోత్సవాలు చేసుకోవడంపై ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఛీ కొడుతున్నారని చెప్పారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరిశీలించారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ అవరణలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ఎలివేటెడ్‌కు మరో ఆటంకం

200 ఫీట్ల మేర భూసేకరణపై అభ్యంతరం

సిటీబ్యూరో: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో మరో కీలక అంశం తెరమీదకు వచ్చింది. ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్ విడుదల కాగా, ప్రాజెక్టు కోసం ఆస్తులు సేకరించేందుకు జిల్లా రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అయితే ప్రాజెక్టు డిజైనింగ్ ప్రకారం ఇరు వైపులా 200 ఫీట్ల వెడల్పుతో ఆస్తులను సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులోభాగంగా భూసేకరణ కోసం జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తూ..నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా 6 లేన్ల భారీ రోడ్ల కోసం ఇరువైపులా కలిపి 200 ఫీట్ల మేర వెడల్పుతో ఈ ప్రాజెక్టు కోసం భూములను సేకరించనున్నట్లు ప్రకటించింది. కానీ ఎలివేటెడ్ కారిడార్ కోసం వంద ఫీట్లకు మించి ఆస్తులను సేకరిస్తే... తమకు నిలువ నీడ ఉండదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 100 ఫీట్ల వెడల్పులోనే ఆస్తులను సేకరించాలని, అంతకు మించి భూసేకరణ అమలు చేయవద్దని కోరారు. అయితే ప్రభుత్వం మాత్రం 200 ఫీట్ల వెడల్పుతో ఆస్తులను సేకరించేందుకు సన్నాహాలు చేయడంతో స్థానికులు మండిపడుతున్నారు.